# రెండో రోజూ... అవే తిప్పలు

## దళారుల వద్ద దరఖాస్తు ఫారాలు

- ఒక్కో ఫారానికి రూ.50 నుంచి రూ.100కు అమ్ముకుంటున్న వైనం
- ప్రజాపాలనలో దరఖాస్తు ఫారాల కష్టాలు
- జిరాక్స్ ఫారాలు తీసుకొని సిబ్బంది
- సందేహాలు నివృత్తి చేయాల్సిన అధికారుల చీదరింపులు
- ఆధార్ అప్‌డేట్స్ కోసం సెంటర్ల వద్ద పడిగాపులు
- ఆరు గ్యారెంటీలేమో కానీ రోడ్డున పడ్డ జనం
- పోసానిపల్లి గ్రామ కౌంటర్‌లోనే కరెంట్ బిల్లులు వసూలు
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న ప్రజలు

సిద్దిపేట, డిసెంబర్ 29(నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం అభాసుపాలవుతున్నది. ప్రభుత్వం చెప్పిన విధంగా క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. శుక్రవారం రెండో రోజూ ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా అభయహస్తం దరఖాస్తు చేసుకోవడానికి వెళ్లిన ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. మొదటి రోజు జరిగిన లోటు పాట్లను సరిచేసుకుని రెండో రోజైనా ప్రజాపాలనను సరిగ్గా నిర్వహిస్తారనుకుంటే అది జరగలేదు. దరఖాస్తు ఫారం నింపడంలో ప్రజలకు అనేక సందేహాలున్నప్పటికీ, వాటిని నివృత్తి చేయడంలో అధికారుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. కౌంటర్ల వద్ద సరిపడా దరఖాస్తు ఫారాలు లేవు. గ్రామసభల్లోనైనా దరఖాస్తు ఫారాలు ఉన్నాయా అంటే అవి కూడా లేవని చెబుతున్నారు. ఏ గ్రామ సభకు వెళ్లినా దరఖాస్తు ఫారాల కొరత స్పష్టంగా కనిపిస్తున్నది.

### దళారుల చేతికి దరఖాస్తు ఫారాలు

గ్రామసభకు ముందే కొంతమంది దళారుల చేతిలోకి దరఖాస్తు ఫారాలు వెళ్తున్నాయి. వాటిని వారి అనుయాయులకు ఇవ్వడంతో పాటు కొన్ని జిరాక్స్ సెంటర్లు, కిరాణా దుకాణాల్లో పెట్టి ఒక్కో దరఖాస్తు ఫారాన్ని రూ.50 నుంచి రూ.100కు అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నారు. అర్జీదారులు జిరాక్స్ ఫారాల్లో తమ కుటుంబ వివరాలు నింపి ఇస్తే, చాలా చోట్ల అధికారులు వాటిని సీకరించడంలేదు. తాము ఇచ్చిన దరఖాస్తు ఫారాల్లోనే నింపి ఇవ్వాలని చెబుతున్నారు. ప్రజలకు సరిపడా దరఖాస్తు ఫారాలను ఎందుకు ఇవ్వడం లేదని ప్రజలు నిలదీస్తే అధికారుల వద్ద సమాధానం లేదు. ప్రతి దరఖాస్తు ఫారానికి కుటుంబ యజమాని ఫొటోతోపాటు, ఆధార్‌కార్డు, కరెంట్ బిల్లు జిరాక్స్ కాపీలు జత చేయాల్సి రావడంతో ఆ కేంద్రాల వద్ద బారులుతీరుతున్నారు.

### ఆధార్ అప్‌డేట్ కోసం అవస్థలు

దరఖాస్తు ఫారమ్‌కు ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతిని జతచేయాల్సి రావడంతో ఆధార్ కార్డు అప్‌డేట్ కోసం ఆధార్ సెంటర్ల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. రాత్రిళ్లు కూడా అక్కడే పడుకొంటున్నారు. తిండి తిప్పలు మాని ప్రజలు ఆధార్ సెంటర్ల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఆధార్ సెంటర్లు తక్కువగా ఉండడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు విద్యుత్ అధికారులు ప్రజాపాలన కౌంటర్లలోనే కరెంట్ బిల్లులు వసూలు చేసి, రసీదు ఇస్తున్నారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం పోసానిపల్లిలో కరెంట్ బిల్లులు ప్రజాపాలన కౌంటర్ వద్దే వసూలుచేశారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు మండిపడుతున్నారు. దరఖాస్తు ఫారాలే ఇవ్వలేని సర్కారు ఆరు గ్యారెంటీలు ఎలా అమలు చేస్తుందని ప్రశ్నిస్తున్నారు.



మెదక్ జిల్లా కేంద్రంలోని ఆధార్ నమోదు కేంద్రం వద్ద తెచ్చుకున్న టిఫిన్ బాక్సులతో భోజనాలు చేస్తున్న మహిళలు

### రైతు భరోసాపై స్పష్టత కరువు

రైతు భరోసాకు ఒక కుటుంటం ఒక దరఖాస్తు ఫారమ్ ఇవ్వాలా..? ఆ కుటుంబంలో వేర్వేరుగా ఉన్న భూమి వివరాలకు మరో ఫారమ్ ఇవ్వాలా అనే విషయంలో స్పష్టతలేదు. ఒక కుటుంబానికి ఇతర గ్రామాల్లో భూములు ఉన్నప్పుడు తాను ఉన్న చోటే ఫారమ్ నింపి ఇవ్వాలా..? ఎక్కడ భూములు ఉన్నాయో అక్కడికి వెళ్లి ఇవ్వాలా అని గ్రామ సభల్లో కొంతమంది రైతులు అధికారులను అడిగితే వారి నుంచి సరైన సమాధానం రావడం లేదు. ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు అధికారుల వద్ద సరైన సమాధానాలు లేవు. ప్రజల సందేహాలకు సమాధానాలు లేని ఈ ప్రజాపాలన ఎందుకో.. కేవలం ఇదంతా కాలయాపన కోసమేనని ప్రజలు చర్చించుకుంటున్నారు. హత్నూరలో ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆర్డీవో రవీందర్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింహులు, జడ్పీటీసీ ఆంజనేయులు, మండల ప్రత్యేకాధికారి, జడ్పీ డిప్యూటీ సీఈవో స్వప్న ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### అధికారులతో వాగ్వాదం

హత్నూరలో దరఖాస్తు ఫారాలు అందజేయకపోవడంతో అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు మానుకొని దరఖాస్తు చేసుకోవడం కోసం వస్తే ఫారాలు ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. ఎంపీడీవో శారదాదేవి కల్పించుకుని అందరికీ దరఖాస్తు ఫారాలు అందజేస్తామన్నారు.




సిద్దిపేట జిల్లా మద్దూరు గ్యాస్ ఏజెన్సీ వద్ద బారులు తీరిన జనం



## చాలా డౌట్లు వస్తున్నాయి

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల కోసం తీసుకుంటున్న దరఖాస్తు ఫారాల్లో వివరాలు నింపుతుంటే చాలా డౌట్లు వస్తున్నాయి. మహాలక్ష్మి పథకం కింద (రూ. 2500) ఎవరు అర్హులు అని చెప్పలేదు.. విద్యుత్ బిల్లు 200 యూనిట్లలోపు ఉచితం కోసం ఇంటి యజమాని పేరు మీద ఉన్న మీటరు నంబర్ వేస్తే మాకు ఎట్లా మేలు కలుగుతది. మేము అద్దెకు ఉంటున్నాం. దరఖాస్తు ఫారంలో ఎవరి కరెంట్ మీటర్ నంబర్ వేయాలో తెలియడం లేదు. ఇట్లా అనేక డౌట్లు ఉన్నాయి. ప్రభుత్వం వీటిని నివృత్తి చేయాలి. అధికారులను అడిగితే క్లారిటీ లేదంటున్నారు. ఎట్లా దరఖాస్తు ఫారం నింపాలో అర్థంకావడం లేదు. గ్యాస్ సిలిండర్లు ఎన్ని వాడుతున్నట్లు అడిగారు. ఎన్ని వాడితే రూ.500 పథకం వర్తిస్తుందో అందులో వివరంగా చెప్పలేదు.

– లావణ్య, సిద్దిపేట

## ఉదయం వచ్చిన.. దరఖాస్తు పత్రాలివ్వడం లేదు



జహీరాబాద్, డిసెంబర్ 29: మాది జహీరాబాద్ పట్టణంలోని 6 వార్డు.. ఉపాధి కోసం సంగారెడ్డిలో ఉంటున్నా. ఉదయం ప్రజాపాలన దరఖాస్తులు ఇస్తున్నారని తెలుసుకొని సంగారెడ్డి నుంచి వచ్చిన. జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డి స్టేడియంలో ఏర్పాటు చేసిన కౌంటర్ వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు సిబ్బంది ఎవరూ దరఖాస్తు పత్రాలు ఇవ్వలేదు. దరఖాస్తు పత్రాలు ఇవ్వాలని కోరితే అధికారులు ఇవ్వలేదని చెబుతున్నారు. ప్రతిఒక్కరికీ దరఖాస్తులు ఇస్తామని ప్రభుత్వం తెలుపుతున్నా ఇక్కడ సిబ్బంది దరఖాస్తు పత్రాలు ఇవ్వడం లేదు. ప్రభుత్వం ఇంటింటికీ తిరిగి దరఖాస్తులు ఇస్తే ప్రజలకు మేలు జరుగుతుంది. కౌంటర్ వద్ద సిబ్బంది కావాల్సిన వారికి దరఖాస్తు పత్రాలు ఇస్తున్నారు.

– శ్రీధర్, సంగారెడ్డి పట్టణం

## ముందే అవగాహన కల్పిస్తే బాగుండేది



మాకు ఇటీవల పెండ్లయింది. కొత్తరేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవడానికి వెళ్తే నా ఆధార్ కార్డులో చిరునామా మార్చుకోవాలని అధికారులు అన్నారు. మీ సేవా సెంటర్ల వద్ద ప్రజల రద్దీ విపరీతంగా ఉంది. ప్రజాపాలన దరఖాస్తు ఫారం గురించి పది రోజుల ముందే అవగాహన కల్పిస్తే బాగుంటుండె. ఇప్పుడు అన్నీ ఒకేసారి కావాలంటే ఇబ్బంది అవుతుంది.

– బేగరి స్రవంతి, గృహిణి, గూడూరు, శివ్వంపేట మండలం

## ఎవరిని అడిగినా.. దరఖాస్తులు ఇవ్వడం లేదు..



జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డి స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కౌంటర్ వద్ద దరఖాస్తు పత్రాలు ఇస్తున్నారని తెలుసుకొని ఉదయం వచ్చినం. దరఖాస్తు పత్రాలు ఇవ్వాలని సిబ్బందిని కోరినా ఎవరూ సరైన సమాధానం ఇవ్వడం లేదు. అధికారులు కొన్ని దరఖాస్తు పత్రాలను ఉదయం ప్రజలకు ఇచ్చారు.. తర్వాత అడిగితే అయిపోయాయి. వచ్చిన తర్వాత ఇస్తామని చెబుతున్నరు. పని మానుకొని ఉదయం కౌంటర్ వద్దకు వచ్చినా దరఖాస్తు పత్రాలు ఇవ్వడం లేదు. ఉన్నతాధికారులు ఎవరూ అందుబాటులో లేరు. సిబ్బంది ఉన్నా వారు సరైన సమాధానం ఇవ్వడం లేదు. సాయంత్రం వరకు ఉన్నా అధికారులు పత్రాలు ఇవ్వలేదు. రేపు చూస్తామని సమాధానం ఇస్తున్నారు.

– విజయ్‌లక్ష్మి, రాచన్నపేట, జహీరాబాద్



మునిపల్లిలో మాట్లాడుతున్న అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

## అర్హులు ఎవరో స్పష్టత లేదు

- అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్

మునిపల్లి, డిసెంబర్ 29: ప్రభుత్వం అమలుచేస్తున్న ఆరు గ్యారెంటీలన్నీ ఆగమాగమేనని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామ శివారులోని సాయి గార్డెన్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతికిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో ప్రజలను మోసం చేస్తుందని, గ్రామాల్లో పెడుతున్న గ్రామసభలతో ప్రజలు తీవ్ర గందరగోళంలో పడ్డారన్నారు. ప్రజలను మరోసారి మోసం చేసేందుకే ప్రజాపాలన పేరుతో కొత్త నాటకం ఆడుతున్నదన్నారు. కాంగ్రెస్ పార్టీ గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రజాపాలనను చూసి ప్రజలు ఎవ్వరు మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయికుమార్, శివశంకర్, మండల పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మంతురి శశికుమార్, ఆయా గ్రామాల సర్పంచులు నారాయణ, రమేశ్, శ్రీనివాస్, మల్లేశం, రాయికోడ్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నారాయణ, డైరెక్టర్లు శ్రీనివాస్, చెన్నవీరయ్యస్వామి, యువత విభాగం మండల అధ్యక్షుడు ఆనంద్‌రావు, మైనార్టీ అధ్యక్షుడు మౌలనా, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## అన్ని వసతులు కల్పించాలి

- ప్రజలకు ఇబ్బందులు లేకుండా దరఖాస్తులు స్వీకరించాలి
- మహిళలు, పురుషులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి
- మెదక్ జిల్లా ప్రజాపాలన నోడల్ అధికారిణి సంగీత

చేగుంట, డిసెంబర్ 29 : ప్రజాపాలన కార్యకమానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని ప్రజాపాలన నోడల్ అధికారిణి సంగీత సూచించారు. మండలంలోని పులిమామిడిలో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో మహిళలు, పురుషులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. దరఖాస్తుదారులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ రమేశ్, మండల ప్రత్యేకాధికారి జంలానాయక్, తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, తహసీల్దార్ గియనిస్సాబేగం, ఈపీఎం లక్ష్మీ నర్సమ్మ పాల్గొన్నారు. నార్సింగి మండలం నర్సంపల్లిలో ఎంపీపీ చిందం సబిత, ఈవో యాదగిరి, నర్సంపల్లి సర్పంచ్ బొమ్మగారి భారతి, కిషన్ తదితరులు హాజరయ్యారు.



మెదక్ జిల్లా చేగుంట మండలం పులిమామిడి గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సభను సందర్శించిన నోడల్ అధికారిణి సంగీత తదితరులు



గూడూరులో ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, అధికారులు

# ఎరువులు, రైతుభరోసా అందించాలి

- ఇచ్చిన హామీ ప్రకారం వరికి బోనస్ చెల్లించాలి
- నియోజకవర్గం సమస్యలు పరిష్కరిస్తా
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- గూడూరులో ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభం

శివ్వంపేట/నర్సాపూర్/హత్నూర, డిసెంబర్ 29: రాష్ట్రంలో వరినాట్లు వేసే సమయమైందని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అత్యవసరంగా ఎరువులు, రైతు భరోసా పంట పెట్టుబడి సాయం అందజేయాలని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శివ్వంపేట మండలం గూడూరులో శుక్రవారం సర్పంచ్ స్వరాజ్యలక్ష్మిశ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీవో భారతితో కలసి ఎమ్మెల్యే ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించేందుకు అధికారులు సహకరించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానిది కొత్తింటి ఇబ్బందులున్నా తినకుండా ఉండలేం కదా, కాబట్టి రైతులకు అత్యవసరంగా ఎరువులు, పెట్టుబడి సాయం వెంటనే అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాపాలనలో దరఖాస్తులను ఏరోజుకారోజు ఆన్‌లైన్ చేయాలని, ప్రతిఒక్కరూ దరఖాస్తు రసీదు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం యువ వికాసం పథకానికి దరఖాస్తులు ఆహ్వానించడం లేదని, అందుకవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి ముందుంటానన్నారు. అనంతరం ఎమ్మెల్యేను పాలకవర్గం ఘనంగా సన్మానించింది. అలాగే మండలంలోని మగ్దుంపూర్, పిల్లుట్ల, లింగోజిగూడ గ్రామాల్లో ప్రజాపాలన నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రాగౌడ్, జడ్పీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు లాయక్, ప్రత్యేకాధికారి నర్సయ్య, తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, ఎంపీవో తిరుపతిరెడ్డి, సీనియర్ నాయకులు యాదాగౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, ఎంపీటీసీ నువ్వుల దశరథ, హనుమంతు, ప్రభాకర్‌రెడ్డి, బేగరి నర్సయ్య, వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

### యువవికాసం ఎక్కడ?

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చిందని, కానీ దరఖాస్తులో మాత్రం ఐదు గ్యారంటీలు మాత్రమే క్రోడీకరించడం జరిగిందని, యువవికాసం అంశాన్ని చేర్చలేదని ఎమ్మెల్యే సునీతారెడ్డి దుయ్యబట్టారు. శుక్రవారం మున్సిపాలిటీలోని 3వ వార్డులో ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు వారి అర్హతను బట్టి దరఖాస్తు ఫారంలో పథకాలను ఎంచుకుని అధికారులకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ కో–ఆప్షన్ మెంబర్ మన్సూర్, మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, బీఆర్‌ఎస్ నాయకులు అశోక్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, నగేశ్, దావూద్, ఆంజనేయులు గౌడ్, రాకేశ్ గౌడ్, అధికారులు, పట్టణ వాసులు పాల్గొన్నారు.

### పథకాలు సక్రమంగా అమలయ్యేలా చూడాలి

ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలయ్యేలా కృషి చేయాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం హత్నూర, లక్మాతండాల్లో ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబాలకు సరిపడా దరఖాస్తు ఫారాలు అందకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. అధికారులు ప్రతికుటుంబానికీ దరఖాస్తు ఫారాలు అందజేయాలన్నారు.



నర్సాపూర్ మున్సిపల్ 3వ వార్డులో అధికారులను అడిగి వివరాలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

# అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు

- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం, డిసెంబర్ 29: ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలను పకడ్బందీగా అమలుచేసి అర్హులైన ప్రతిఒక్కరికీ అందించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం రామచంద్రాపురం డివిజన్‌పరిధిలోని జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృద్ధులు, నిరక్షరాస్యులకు అవగాహన కల్పించి దరఖాస్తులు నింపడంలో సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పుష్పానగేశ్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు ఆదర్శ్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేశ్, సీనియర్ నాయకులు పరమేశ్ యాదవ్, గోవింద్, కుమార్ గౌడ్, ఐలేశ్‌యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రామచంద్రాపురంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

## ఎవ్వలు సక్కగా సెప్తలేరు?



అభయహస్తం దరఖాస్తులు ఎట్లా జెయ్యాల్లో ఎవ్వలు కూడా సక్కగా సెప్తలేరు. కొందరికీ ఫారాలు ఇచ్చిండ్రు, ఇంకొందరి ఇయ్యనేలేదు. మీరే జిరాక్స్‌లు తెచ్చుకొమ్మంటున్నారు. దరఖాస్తులో మీటర్ నంబర్, గ్యాస్ నంబర్ ఎయ్యాలని ఉన్నది. గ్యాస్ పుస్తకంలో రెండు, మూడు నంబర్లు ఉండడంతో ఏ నంబర్ ఎయ్యాల్లో తెలుత్తలేదు. అధికారులు జెర్ర తెలిసేటట్టు జెప్పాలి. దరఖాస్తు ఫారం ఎవ్వలకు అర్థమైతలేదు.

– నిమ్మ శోభ, మహిళా రైతు, అల్వాల (మిరుదొడ్డి)

## అంతా గందరగోళంగా ఉంది



మా రేషన్‌కార్డులో నా కొడుకు, కూతురు పేర్లు లేవు. అందులో వారి పేర్లు ఎక్కించాలని ఆడిగితే, ఇక్కడి అధికారులు దానికి సంబంధించిన వివరాలు చెప్పడంలేదు. ఆభయ హస్తం దరఖాస్తు ఫారంలో రేషన్ కార్డు ఉండాలని ఆడుగుతున్నారు. మరి వారికి ఈ పథకాలు వర్తిస్తాయా లేదా అనే విషయం నాకు ఆర్థం కావడంలేదు. మహాలక్ష్మి పథకం వర్తిస్తుందో లేదో అధికారులు చెప్పడంలేదు. అంతా గందరగోళంగా ఉంది.

– సింగరవేణి రమేశ్, గుర్రాలగొంది, సిద్దిపేట

## అర్హత ఉన్నా ఫారం నింపలేదు



మా ఇద్దరిలో ఎవరికో ఒకరికి వృద్ధాప్య పింఛన్ వస్తుందేమోననే అశతో దరఖాస్తు చేసుకోవడానికి వచ్చినం. అయితే, ఆరు గ్యారంటీల్లో కొన్నింటికి మాత్రమే మీరు అర్హులని, పింఛన్ రాదని దరఖాస్తు తీసుకునే వారు చెప్పారు. ఆధార్ కార్డు ప్రకారం మాకు అరవై ఏండ్లకు పైగా వయస్సు ఉంది. అయినా దరఖాస్తు ఫారం తీసుకునేందుకు అంగీకరించలేదు. చివరికి గొడవ పడితే తప్ప నింపలేదు.

– కాసుల కిషన్, ఎల్లమ్మ (వృద్ధులు) లక్ష్మాపూర్

## తెల్వని విషయాలు ఏం చెప్తలేరు



తెల్వని విషయాలను అధికారులు చెప్తలేరు. ఫారాలు ఇచ్చిండ్రు నింపుకొని రమ్మన్నరు. మాకు ఎట్లా నింపాలనో అర్థం కాక ఎవ్వలను బతిమిలాడినా నింపియడం లేదు. అధికారులే మాకు ఆ దరఖాస్తు ఫారాన్ని నింపిస్తే మంచిగ ఉంటది. సర్కారు చెప్పేది ఒకటి, అధికారులు చేసేది మరొకటి. మా దరఖాస్తు ఫారాలను అధికారులు నింపి సర్కారుకిస్తేనే మంచిగుంటది. శాన ఇబ్బందులు పడుతున్నం.

– సిద్దల మల్లవ్వ, బండారుపల్లి, తొగుట

## రేషన్ కార్డు ఉంటేనే దరఖాస్తు ఇస్తరంట



గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆరు గ్యారెంటీల ఫారాలు ఇస్తున్నారంటే తీసుకోడానికి వెళ్లిన. కానీ అక్కడ రేషన్ కార్డు చూపిస్తేనే దరఖాస్తు ఇస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాత్రం రేషన్ కార్డు లేనివారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఇదే విషయం పంచాయతీ సెక్రటరీకి చెబితే ఓ వినతి పత్రం రాసి ఇవ్వాలన్నారు. వినతి పత్రం ఇస్తే దరఖాస్తు ఇస్తారా అని అడిగితే పొంతన లేని సమాధానం చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయింది. నాకు భార్య, కూతురు ఉన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రేషన్ కార్డు లేకుండా ఎలా పొందాలో సమజైతలేదు.

– పెంటయ్య, బ్రాహ్మణపల్లి, నర్సాపూర్